క్లుప్తంగా

సన్మానం



కవ్వంపల్లి సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణను శుక్రవారం కరీంనగర్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి తదితరులు కలిసి ఎన్నికల సరళిని చర్చించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు.

లీజుకు ఆలయ భూమి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ శివారులోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూమిని ఏడాది కాలపరిమితికి వేలం పాట వేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహక అధికారి విశ్వనాథశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతసాగర్ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొని దేవాలయ భూమిని లీజు ద్వారా హక్కు పొందవచ్చని పేర్కొన్నారు.

ఆలయ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు వీరే..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ మహంకాళీ ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్ముల స్వామి, ఉపాధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా తోట వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

సోనుసూద్ విగ్రహం పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): సోనుసూద్ సేవా సంస్థ కార్యకర్త గుల్షాన్ ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం దుబ్బాతండా పంచాయతీ పరిధిలోని సోనుసూద్ విగ్రహాన్ని పరిశీలించారు. మద్దూరు ఉమ్మడి మండల పరిధిలోని దుబ్బతండా గ్రామ పంచాయితీకి చెందిన రాజేశ్ గతంలో సోనుసూద్ విగ్రహాన్ని నెలకొల్పాడు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

గజ్వేల్‌రూరల్: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఎల్లప్పుడు ఉండాలని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించగా మహిళా భక్తులు సామూహిక వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎర్రం శ్రీనివాస్, సిద్ది భిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

‘సురభి’లో ఉచిత వైద్య సేవలు



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాలకు అనుబంధంగా సిద్దిపేటలో నూతనంగా ప్రారంభమైన సురభి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 10వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివరామచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పది రోజులపాటు ఉచిత వైద్యం అందించడంతో పాటు ల్యాబ్ పరీక్షల్లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. ఇతర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల కంటే తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి దందా!



తిప్పారం గ్రామ శివారులో టిప్పర్‌లో నింపుతున్న మట్టి



మల్లన్నసాగర్ కాలువ పక్కన అక్రమంగా తరలించిన మట్టి

- లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని కుకునూరుపల్లి, తిప్పారం, ముద్దాపూర్, మేదినీపూర్ గ్రామ శివారుల్లో కాల్వల పక్కన పెద్ద ఎత్తున మట్టి కుప్పలు పోశారు. గజ్వేల్, కుకునూరుపల్లి మండలాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు, ఇతరత్ర పనులకు ఈ మట్టిని ఉపయోగిస్తున్నారు. కుకునూరుపల్లి, లకుడారం, మేదీనీపూర్, తిప్పారం గ్రామ శివారుల్లో రియల్టర్లు ఎకరాల కొద్ది వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా వెంచర్లు చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఇటాచీలు, జేసీబీలతో మట్టిని తీస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. రోజుకు రూ. లక్షల్లో దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. మట్టి దందా బయటకు తెలియకుండా సెలవు రోజుల్లో రాత్రి సమయంలో టిప్పర్లతో రోజూ వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. నిత్యం రాజీవ్ రహదారిపై నిత్యం దందా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దందా సాగుతుండటంతో మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర కిలో మీటర్ వరకు టిప్పర్లు రాంగ్ రూట్‌లో వెళ్తుండడంతో పోలీసులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల కోసం ఎక్కడా పిడికెడు మట్టి దొరకని పరిస్థితి నెలకొనే అవకాశం లేకపోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పక్కన ఉన్న మట్టి అక్రమ తరలింపు విషయమై ఇరిగేషన్ శాఖ మండల ఏఈ భాగ్యలక్ష్మి పలుమార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది కొరతతో మట్టి తరలింపును ఆపడం కుదరడం లేదని చెబుతున్నారని తెలిపారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాను అరికట్టి ప్రకృతి సంపద తరిగిపోకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని వివరణ కోరగా కాలువ పక్కన మట్టి తరలిపోకుండా చూసుకునే బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారుల దేనని చెప్పడం గమనార్హం.

సిద్దిపేట @ 76.33 పోలింగ్

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో గురువారం జరిగిన పోలింగ్‌లో 76.33 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. నియోజకవర్గ పరిధిలో 233733 ఓట్లకు గాను 178420 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనితో మొత్తంగా నియోజకవర్గ పరిధిలో 55313 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. వీరిలో సిద్దిపేట పట్టణంలో 37088 మంది ఓటర్లు ఉండడం విశేషం. నియోజకవర్గంలో అత్యధికంగా ఎదులవాడ పోలింగ్‌స్టేషన్‌లో 96 శాతం నమోదు అయింది. 250 ఓట్లకు గాను 240 ఓట్లు పోల్ అయ్యాయి. మరోవైపు అత్యల్పంగా సిద్దిపేట పట్టణంలోని బీఎమ్మెఆర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో 46.79 శాతం నమోదు అయింది. ఇక్కడ 949 ఓట్లకు గాను 444 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. నియోజకవర్గ పోలింగ్ సరళిని పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. అదే సిద్దిపేట పట్టణంలో 107616 ఓట్లకు గాను 70528 మంది ఓటర్లు తమ ఓటుహక్కును పట్టణంలో సద్వినియోగం చేసుకున్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు పోల్ అయిన ఓట్ల ఆధారంగా మండల, పట్టణ వారీగా తమ పార్టీలకు ఏ మేరకు ఓటింగ్ శాతం రావచ్చు అనే అంశంపై సమీక్షలు చేసుకుంటున్నారు.



సిద్దిపేటలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

బంజేరుపల్లిలో 96.77 శాతం

సిద్దిపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట నియోజకవర్గంలో నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎక్కువ మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు రూరల్ మండల పరిధిలోని సీఎం స్వగ్రామమైన చింతమడకలో 92.16 శాతం పోలింగ్ నమోదు కాగా, సీతారాంపల్లిలో 93.02 శాతం, మాచాపూర్‌లో 95.11 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే బండచెర్లపల్లిలో 92.89 శాతం, ఇర్కోడ్‌లో 90 శాతం పోలింగ్ నమోదైంది. నారాయణరావుపేట మండల పరిధిలోని బంజేరుపల్లిలో అత్యధికంగా 96.77 శాతం పోలింగ్ నమోదు కాగా కోదండరావుపల్లిలో 91.99 శాతం, ఇబ్రహీంపూర్‌లో 90.61 శాతం నమోదైంది.

అప్పాయిపల్లిలో అత్యధికం.. చేగుంట అత్యల్పం

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లిలోని పీఎస్ 173లో అత్యధికంగా 97.35 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 414 ఓటర్లకు గాను 404 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా నియోజకవర్గంలోని చేగుంట పీఎస్ 228లో అత్యల్పంగా 62.30 మాత్రమే పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 1138 కి గాను 709 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరంలో 412కు గాను 396 మంది ఓటు వేయగా 96.12 శాతం, దౌల్తాబాద్ మండలం లింగాయిపల్లిలో 96.23 శాతం, భీంరావుపల్లిలో 96.42 శాతం, వీరారెడ్డిపల్లిలో 95.86 శాతం అత్యధికంగా పోలింగ్ నమోదైంది.

అక్కన్నపేటలో 85.75 శాతం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 32,356 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 27,746 ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 85.75 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా మండలంలోని చౌడుతండాలో అత్యతంగా 93 శాతం ఓట్లు పోల్ కాగా చాపగానీతండాలో 79.43 శాతం ఓట్లు నమోదయ్యాయి.

జనావాసాల్లో వైన్స్‌లు వద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): జన సమూహం, పాఠశాలలు, ఇళ్ల మధ్య వైన్స్ షాపులకు అనుమతి ఇవ్వొద్దని చిన్నకోడూరు గ్రామ యువకులు ఎక్సైజ్ శాఖ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చిన్నకోడూరులో బస్టాండ్, పాఠశాలల సమీపంలో వైన్స్‌లు ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఈవిషయమై గ్రామ పంచాయతీకి, ఎక్సైజ్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు టౌన్: గీతం వర్సిటీ రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని తనూ శ్రీవాస్తవకు పీహెచ్‌డీ లభించింది. ఈమె ‘ఏరోస్పేస్ అప్లికేషన్ కోసం థర్మల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్ అభివృద్ధి’ అంశంపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ కుమార్, ప్రొఫెసర్ రావూరి బాలాజీ రావు అధ్యయనానికి మార్గదర్శనం వహించినట్లు శుక్రవారం తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: మతిస్థిమితం లేని వ్యక్తి కనిపించకుండా పోయినట్లు సీఐ శ్రీధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డిలోని ఇంద్రకాలనీకి చెందిన పట్నం జగన్నాథం ఆరోగ్యం బాగా లేకపోవడంతో భార్య లక్ష్మితో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యం చేయించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు. అతడికి మతిస్థిమితం సరిగాలేదు. తెలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసినవారు 8712656718 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఆగని వలసలు

- ఉపాధి లేక దూరప్రాంతాలకు కూలీల పయనం
- చదువుకు దూరమవుతున్న పిల్లలు
- స్థానిక ఉపాధిపై దృష్టిసారించాలని వినతి

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదు. స్థానికంగా ఉపాధి లేక దూర ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి. ఏటా చెరకు కటింగ్ సీజన్ వచ్చిందంటే గిరిజన తండాలు ఖాళీ అవుతున్నాయి. తండా కూలీలు వలస బాట పడుతున్నారు. వర్షాకాలంలో ఇంటిపట్టున ఉన్న వ్యవసాయ కూలీలు అక్టోబర్, నవంబర్‌లో నారాయణఖేడ్ పరిసరాల్లోని కంగ్టి, తడ్కల్ మండలాల నుంచి వేలాది కూలీలు దాదాపు ఆరు నెలల పాటు వలస వెళ్తున్నారు. వారితోపాటు పిల్లలను సైతం తమ వెంటబెట్టుకొని వెళ్తుండటంతో వారు చదువులకు దూరమవుతున్నారు. దీంతో తరాలు మారినా తమ పిల్లలు ఉన్నత విద్యలేక కూలీలుగా మారాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజులుగా కంగ్టి, తడ్కల్ మండలాల నుంచి కూలీలు వలసబాట పట్టారు. కొన్ని తండాల్లో ఇళ్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జహీరాబాద్, కామారెడ్డి, తాండూరు, వికారాబాద్, బోధన్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. వర్షాకాలంలో పంటలు పండించేందుకు పెట్టుబడుల ఖర్చుల కోసం ఆయా ప్రాంతాల నుంచి చెరకు నరికేందుకు ఒప్పందం చేసుకొని కొంత మొత్తం అడ్వాన్స్ తీసుకొని వస్తారు. సీజన్ ప్రారంభం కాగానే వెళ్లక తప్పని పరిస్థితని కూలీలు చెబుతున్నారు. తమకు స్థానికంగా ఉపాధి దొరికితే బతుకుదెరువుకు మరో చోటికి వెళ్లాల్సిన దుస్థితి ఉండదంటున్నారు. కొందరు వృద్ధులను వదిలి వెళ్లడంతో వారి బాగోగులు చూసుకొనే వారు లేక తిప్పలు పడుతున్నారు. ఇకనైనా స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తే తమకు మేలు జరుగుతుందంటున్నారు.



కంగ్టి నుంచి చెరకు నరికేందుకు కుటుంబాలతో వెళ్తున్న కూలీలు

కల్యాణం.. కమనీయం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన, అలంకరణ, ఆరాధన, వాసుదేవ పుణ్యావచనం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కిష్టయ్య ఆశయాలను కొనసాగిద్దాం



కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మలిదశ తెలంగాణ పోరాటంలో వీర మరణం పొందిన కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ ఆశయాలను కొనసాగిద్దామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 14 వర్ధంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు జంగిటి శ్రీనివాస్, బైరి శంకర్, పార్వతి బైరయ్య, పైసా రామకష్ణ, గాడిచెర్ల సతీష్, తొట్ల పర్శరములు, పడిగే ప్రశాంత్, పాతర్ల వెంకటేశ్వర్లు, బోనాల నాగరాజు, బోనాల శ్రీనివాస్, సూతరి రాజు, గాడిచెర్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు కిష్టయ్య అని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, నాయకులు నారాయణ, సుధాకర్, శ్రీకాంత్, శేఖర్, నాగరాజు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిరండి

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట సాధనకు ఈనెల 4న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి దళిత బహుజనులు తరలిరావాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగుపల్లిలో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్త ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అటకెక్కించి భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ విధి విధానాలను ప్రతిఘటిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు కిరణ్, బాల్‌నర్సు, ఎల్లవ్వ, అనసూయ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నాయకులు

ఓట్ల లెక్కల్లో పార్టీల నాయకులు

చేగుంట(తూప్రాన్): ఎన్నికల ప్రక్రియ పూర్తయి ఓట్ల లెక్కింపు కోసం ఇంకా 24 గంటల సమయం ఉండగా, తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయనే లెక్కల్లో నాయకులు బీజీగా ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని ఉమ్మడి చేగుంట మండలంలో ఏ పార్టీకి మెజార్టీ ఓట్లు వస్తే ఆదే పార్టీ విజయం సాధించడం ఖాయమనే నానుడి ఉంది. చేగుంట మండలం దుబ్బాక నియోజకవర్గంలో కలిసిన మొదటిసారి జరిగిన 2009 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి చేగుంట మండలం నుంచి వచ్చిన 1300 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చెరుకు ముత్యంరెడ్డి గెలుపొందారు. తర్వాత తెలంగాణ ఏర్పాటు అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో దివంగత నేత రామలింగారెడ్డి టీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. రామలింగారెడ్డి మరణం అనంతరం 2018లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఉమ్మడి చేగుంట మండల ఓటర్లు ఇచ్చిన 1734 ఓట్ల మెజార్టీతో గెలుపొంది రాష్ట్ర స్థాయిలో సంచలనం సృష్టించారు. తిరిగి మూడోసారి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఎవరి తలరాతను చేగుంట మండల ఓటర్లు తిరగరాస్తారో అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. గురువారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి చేగుంట మండలంలో 36518 ఓట్లు పోలైన్నాయి. బీజేపీ నాయకులు తమకు 18 వేలకు పైగా ఓట్లు పడతాయనే ధీమాతో ఉండగా, బీఆర్ఎస్ నాయకులు మాత్రం 20 వేల ఓట్లు సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీకి సైతం సైలెంట్ జరిగినట్లు గ్రామాల్లోని ఓటర్లే చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు ఎవరికి లాభం చేస్తాయో ఎవరి కొంపముంచుతాయో అని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు.



వృథాగా నల్లా నీరు

పట్టించుకోని అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో పబ్లిక్ నల్లాకు ట్యాప్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. మంచి నీటి సరఫరా జరిగినంతసేపు నీరు వృథాను అరికట్టలేకపోతున్నారు. దీంతో చాలా మందికి అవసరమైన తాగునీరు లభించని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

